క్లుప్తంగా

నేడు బిలోలిలో కుస్తీ పోటీలు

లోకేశ్వరం: శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని బిలోలి గ్రామంలో బుధవారం మధ్యాహ్నం రామాలయం ఆవరణలో కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు వీడీసీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు మల్ల యోధులు సకాలంలో హాజరవాలని కోరారు.

19న చినజీయర్ రాక

కడెం: మండలంలోని మారుమూల ప్రాంతమైన అల్లంపల్లికి ఈనెల 19న శ్రీ త్రిదండి చినజీయర్‌స్వామి రానున్నారు. గ్రామంలో నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయం, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్(జెట్)ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాల ప్రారంభించనున్నట్లు జెట్ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు.

క్రమశిక్షణతో పెంచాలి



మాట్లాడుతున్న ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి

కడెం: పిల్లలను క్రమశిక్షణతో పెంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని లింగాపూర్‌లో మత్తుపదార్థాలు, నేరాల నియంత్రణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పిల్లల నడవడికను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరం ఉంటూ చదువు, క్రీడల్లో రాణిస్తూ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని పిలుపునిచ్చారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి

లోకేశ్వరం: గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎండలు పెరుగుతున్నందున ఉదయం 8 నుంచి 11 గంటల వరకే ఉపాధి కూలీలతో పనులు చేయించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యల్లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీలోనే సురక్షిత ప్రయాణం

కుంటాల: ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని సిబ్బంది ఎంఏ హక్, సేఫ్టీ వార్డెన్ బర్కతుల్లా పేర్కొన్నారు. భైంసా డీఎం అమృత ఆదేశాల మేరకు మండలంలోని కల్లూర్‌లో మంగళవారం రోడ్డు భద్రతపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

33కేవీ ఫీడర్ ప్రారంభం

సోన్: పోచంపాడ్ నుంచి సోన్ వరకు ఏర్పాటు చేసిన మిడిల్ పోల్స్, కండక్టర్(33 కేవీ ఫీడర్)ను మంగళవారం మండలంలోని పాత బ్రిడ్జిపై ఎస్ఈ జయవంత్‌చౌహాన్ ప్రారంభించారు. వచ్చే 60 ఏళ్ల వరకు ఎలాంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈ నాగరాజు, ఏడీఈ రవి, ఏఈ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. పూజారులు, టెంట్‌హౌజ్ నిర్వాహకులను కలిసి బాల్యవివాహాలను ప్రోత్సహించొద్దని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బాల్యవివాహాలు చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇందులో అంగన్‌వాడీ టీచర్లు నేదూరి నిర్మల, మంగ, శ్రీలత, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

భైంసారూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వాలేగాం గ్రామంలో పర్యటించి పరిసరాలు, మురుగుకాలువలు, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోడ్లపై చెత్తాచెదారం లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. వారి వెంట ఎంపీటీసీ మానిక్, కార్యదర్శి సింధూజ ఉన్నారు.

ముధోల్ చేరిన ఈవీఎంలు

ముధోల్: వచ్చే నెలలో జరిగే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన సామగ్రి మంగళవారం రాత్రి ముధోల్ చేరింది. అధికారులు సామగ్రిని ప్రత్యేక వాహనంలో తీసుకొచ్చి స్థానిక బాలుర గురుకుల కళాశాలలో భద్రపరిచారు. ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్ పి.విఠల్, సీఐ మల్లేశ్, ఎస్సై సాయికిరణ్ ఆధ్వర్యంలో ఈవీఎంలను సీల్ తీసి స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పాఠశాలలో సీఆర్‌పీఎఫ్ బలగాలను బందోబస్తుగా ఉంచారు. 311 బూత్‌లకు గాను 419 ఈవీఎంలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ముస్తాబైన రామాలయాలు

- నేడు సీతారాముల కల్యాణం
- తరలిరానున్న భక్తులు



ఆలయంలో స్వామివారు



జిల్లాకేంద్రంలోని బాగులవాడ రామాలయం

నిర్మల్‌టౌన్: శ్రీరామనవమి సందర్భంగా జిల్లా కేంద్రంలోని రామాలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. బాగులవాడ వాల్మీకినగర్ రామాలయం, బ్రహ్మపురి రాంమందిర్, శాంతినగర్ రామాలయం, దేవరకోట దేవస్థానంలో భక్తులకు ఇబ్బందులు కల్గకుండా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే నవమి వేడుకలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సీతారాముల కల్యాణోత్సవానికి ఉపయోగించే ముత్యాల తలంబ్రాలు, మంగళసూత్రాలను తయారు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం 11 గంటలకు జరిగే శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి భక్తులు తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. హిందూవాహిని ఆధ్వర్యంలో దేవరకోట దేవస్థానం నుంచి ప్రారంభించే శ్రీరాముని శోభాయాత్రను ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ప్రారంభిస్తారు.

వందేళ్ల చరిత్ర..

పట్టణంలోని బ్రహ్మపురి కాలనీలో రామ్‌మందిర్‌గా పిలువబడే ఈ పురాతన ఆలయం వందేళ్ల కిందట ఏర్పాటు చేశారు. తడకలతో ఏర్పాటు చేసి చెక్క విగ్రహాలకు పూజలు నిర్వహించారు. 1980లో ఆలయం నిర్మించి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అప్పటినుంచి ఏటా శ్రీరామనవమికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున 5:30గంటల నుంచి అభిషేకాలు, నిత్యపూజ, సర్వదర్శనం, మధ్యాహ్నం 12:15 గంటలకు శ్రీసీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. అన్నదానం అనంతరం సాయంత్రం పల్లకిసేవ, ఊరేగింపు, హారతి, ముగింపు పూజాది కార్యక్రమాలు జరిపిస్తారు. శేట్‌పెల్లి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో ఈ పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు.



చామన్‌పెల్లిలో ముస్తాబైన రామాలయం

వాల్మీకి నగర్ రామాలయం..

బాగులవాడ వాల్మీకినగర్ రామాలయంలో 1993లో శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి చేతుల మీదుగా విగ్రహాలను ప్రతిష్ఠించారు. బుధవారం అభిషేకాలు, నిత్యపూజ, సర్వదర్శనం, జానకిశ్రీరాముల కల్యాణం నిర్వహిస్తారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేస్తారు. ఈఆలయంతోపాటు శాంతినగర్ రామాలయంలో పూజలు జరిపిస్తారు.

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లిలో రామాలయం శ్రీరామనవమి వేడుకలకు సిద్ధమైంది. భక్తులకు ఇబ్బంది కల్గకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గంగారెడ్డి తెలిపారు. ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, దేవత ఆహ్వానం, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉదయం నిత్య హోమం, బలిప్రదానం, డోల సేవ నిర్వహించనున్నారు. 11:35 గంటలకు శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు.

సారంగాపూర్: శ్రీరామనవమి వేడుకల కోసం మండలంలోని జామ్ గ్రామంలో పట్టాభి రామాలయం, స్వర్ణలోని రామాలయం ముస్తాబయ్యాయి. బుధవారం జరిగే శ్రీసీతారాముల కల్యాణం కోసం వీడీసీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం జామ్ పట్టాభి రామాలయం ఆవరణలో కళాకారులు జడకొప్పు ఆడి అలరించారు. శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి హరికథ, భజన సంకీర్తనలు నిర్వహించనున్నట్లు జామ్ వీడీసీ సభ్యులు తెలిపారు.

కుంటాల: శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా కల్లూర్ సాయిబాబా, కుంటాల శ్రీరామకృష్ణ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. సీతారాముల కల్యాణానికి భక్తులు తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

ఖానాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి అన్నారు. బూత్ విజయ్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా మంగళవారం పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి 235వ బూత్ పరిధి ఇంద్రనగర్‌లో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన మాజీ వార్డు సభ్యురాలు ముత్యపు రాధ ఆధ్వర్యంలో సుమారు 50 మంది బీజేపీలో చేరారు. అనంతరం శ్రీరాంనగర్‌లోని సీతారాచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో బీజేపీ బూత్ అధ్యక్షులకు ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. అంకం మహేందర్, నాయిని సంతోష్, ఆకుల శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, కొండవేణి రమేశ్, బొప్పారపు సత్యవతి, రుస్తుం, దాదె మల్లయ్య, గోపాల్‌రెడ్డి, ఎనగందుల రవి, శ్రీధర్, లింబాద్రి, తుప్ప రమేశ్, కమలాకర్ తదితరులు ఉన్నారు.

భైంసాటౌన్: దేశం మరింత అభివృద్ధి చెందేందుకు మోదీని మూడోసారి ప్రధానిగా చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్ అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా మంగళవారం పట్టణంలోని నర్సింహానగర్ 131వ బూత్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ వివరించారు. బూత్ అధ్యక్షులు వేణుగోపాల్, సుభాష్, దిలీప్, అభిషేక్, అరుణరెడ్డి పాల్గొన్నారు.



సోన్: పాక్‌పట్లలో ఉపాధి కూలీలకు కేంద్ర పథకాలు వివరిస్తున్న బీజేపీ నాయకులు

నర్సాపూర్(జి): బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా అధికార ప్రతినిధి బర్కుంట నరేందర్ అన్నారు. నర్సాపూర్ (జి)లో బీజేపీ నాయకులు మంగళవారం ఇంటింటా ప్రచారం ఎన్నికల నిర్వహించారు. ఆదిలాబాద్ ఎంపీగా నగేశ్‌ను గెలిపించాలని కోరారు. గుండోల్ల దత్తురాం, కోడె సుధాకర్, బొల్లి గంగారాం, లక్ష్మణ్ పాల్గొన్నారు.



భైంసాలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

సోన్: మండలంలోని పాక్‌పట్లలో మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధిహామీ పని ప్రదేశం వద్దకు వెళ్లి కూలీలకు కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. హరీశ్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, గంగారెడ్డి, అశోక్, గోవర్ధన్, ముత్యంరెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: బీజేపీ ఎంపీ అభ్యర్థి నగేశ్‌ను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు మంగళవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో పీచర ఎంపీటీసీ రాజేశ్వర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి

తానూరు: నర్సరీల్లో మొక్కలకు నీటిని అందించి ఎండిపోకుండా చూడాలని ఈజీఎస్ ఏపీవో గంగాధర్ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండలంలోని జౌలా(బి), తొండాల గ్రామాల్లో పర్యటించి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలను ఆయన పరిశీలించారు. జాబ్‌కార్డు కలిగిన కూలీలు ఉపాధి పనులకు వెళ్లాలని సూచించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి మతీన్, ఫీల్డ్ అసిస్టెంట్ అన్వర్ తదితరులు ఉన్నారు.

తానూరు మండలంలోని మొగ్లి, కోలూరు, సింగన్‌గాం గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను మంగళవారం ఎంపీడీవో మోహన్‌సింగ్ పరిశీలించారు.



జౌలా(బి)లో పరిశీలిస్తున్న ఏపీవో గంగాధర్

గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సిబ్బందికి సూచించారు. సింగన్‌గాం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి సమస్యలు తెలుసుకున్నారు. కార్యదర్శి విఠల్, సిబ్బంది ఉన్నారు.

'కాంగ్రెస్‌తోనే న్యాయం'

కడెం: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం కడెంలో మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. బీజేపీకి ఓటు వేసి మోసపోకుండా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని పిలుపునిచ్చారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బరుపటి రమేశ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తరి శంకర్, సత్యంచారి, రాజన్న తదితరులు ఉన్నారు.

గాయపడిన ఆవుకు చికిత్స

ఖానాపూర్: పట్టణంలోని బస్టాండ్ ఏరియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఓ ఆవుకు మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి చికిత్స చేయించారు. వాహనం టైరు తలపై నుంచి వెళ్లడంతో గాయపడ్డ ఆవుకు పశువైద్యాధికారి రామచంద్రుడు, సిబ్బంది చికిత్స చేశారు. యజమానులు పశువులను రోడ్లపై వదిలితే గోశాలలకు తరలిస్తామని హెచ్చరించారు.

అంబేద్కర్ జయంతి

కుంటాల: మండలంలోని విఠాపూర్ గ్రామంలో మంగళవారం అంబేద్కర్ జయంతి నిర్వహించారు. పంచశీల జెండాను ఆవిష్కరించి అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీ రమేశ్, నాయకులు విఠల్‌రావు పటేల్, సుదర్శన్‌రెడ్డి, అంబేద్కర్ సంఘ సభ్యులు లక్ష్మణ్, పరశురాం, దిగంబర్, గంగన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై పట్టింపేది..?



ఫైర్‌స్టేషన్-పెట్రోల్‌బంక్ సమీపంలో దెబ్బతిన్న ఫెన్సింగ్



చెత్త పేరుకుపోవడంతో నిలిచిన నీరు



ఆర్టీసీ డిపో వద్ద దెబ్బతిన్న డివైడర్

భైంసాటౌన్: పట్టణంలో భైంసా-నిర్మల్ జాతీయ రహదారి నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. సంబంధిత రోడ్డు నిర్వహణ సంస్థ, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. పట్టణంలోని స్థానిక ఆర్టీసీ డిపో నుంచి పార్డి(బి) బైపాస్‌రోడ్డు వరకు జాతీయ రహదారి డివైడర్‌పై రోడ్డు పొడవునా మొక్కలు నాటి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. కొన్నిచోట్ల ఫెన్సింగ్ దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. కొన్నిచోట్ల డివైడర్‌కు సైతం పగుళ్లు ఏర్పడ్డాయి. రోడ్డుకు ఇటు నుంచి అటువైపు వెళ్లే యూటర్న్‌ల వద్ద డివైడర్ దెబ్బతింది. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన యూటర్న్‌ల వద్ద వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షపు నీరు రోడ్డుపై నిలవకుండా ఏర్పాటు చేసిన ఖాళీలు చెత్తతో నిండి రోడ్డుపైనే నీరు నిలుస్తోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని దివ్యనగర్ అయ్యప్ప ఆలయం ఎదుట ప్రభుత్వ భూమిలోంచి అంబేద్కర్ చిత్రపటాన్ని తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం అంబేద్కర్ స్టడీ సర్కిల్ జేఏసీ నాయకులు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 534 సర్వేనెంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. హద్దులు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపయోగపడేలా అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బత్తుల రంజిత్, కొంతం గణేశ్, కత్తి నవీన్, రవి, అరుణ్, సిద్ధార్థ పాల్గొన్నారు.

'ఆత్మహత్యలపై విచారణ జరిపించాలి'



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌రూరల్: బాసర ట్రిపుల్‌ఐటీలో జరుగుతున్న ఆత్మహత్యలపై వెంటనే విచారణ జరిపించాలని టీజీవీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొట్టూరి ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆత్మహత్యలకు కారణమైన వారిని విధుల నుంచి తొలగించాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి బాసర ట్రిపుల్‌ఐటీపై ప్రత్యేక దృష్టి సారించి అరవింద్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఇందులో పట్టణ కన్వీనర్ సాయి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థి అరవింద్‌ది ప్రభుత్వ హత్యేనని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నామత్కర్ నవీన్ అన్నారు. అరవింద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్రంలోని ఆసుపత్రికి తీసుకురాగా ఎస్ఎఫ్ఐ నాయకులు అడ్డుకొని నిరసన తెలిపారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల సాయం, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్, సాయి, సత్యం పాల్గొన్నారు.

వేధిస్తే 100కు డయల్ చేయండి



ప్రయాణికులతో షీ టీం పోలీసులు

నిర్మల్‌టౌన్: ఆకతాయిలు వేధిస్తే ఆందోళన చెందకుండా వెంటనే 100కు డయల్ చేయాలని షీటీం పోలీసులు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు షీటీం బృందం ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. 100కు డయల్, సీసీ కెమెరాలతో లాభాలు, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం, టోల్ ఫ్రీ నెంబర్ 1930 గురించి వివరించారు. షీ టీం ఎమర్జెన్సీ నెంబర్ 8712659550కు ఫోన్ చేయాలని సూచించారు. ఇందులో షీటీం పోలీసులు రమాదేవి, రాధిక, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆదిలాబాద్ తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

నిర్మల్‌టౌన్: ఆదిలాబాద్‌లోని గాయత్రి గార్డెన్‌లో మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన నిర్వహించిన పార్లమెంటరీ ఎన్నికల బూత్ స్థాయి సమావేశానికి నిర్మల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంపై బీఆర్ఎస్ జెండా ఎరుగవేద్దామని నాయకులు తెలిపారు. డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్ రెడ్డి, నిర్మల్ పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు మారుగొండ రాము, డాక్టర్ సుభాశ్‌రావు తదితరులు వెళ్లారు.

కుంటాల: ఆదిలాబాద్‌లో కేటీఆర్ అధ్యక్షతన నిర్వహించిన బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి కుంటాల మండలం నుంచి ఆయా గ్రామాల పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి, సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి పెంటవార్ దశరథ్, దాసరి కిషన్, భోజన్న, డాక్టర్ శ్రీనివాస్, దత్తు, భోగ లక్ష్మణ్, మనోహర్, అశోక్, సంతోష్, గగన్ తదితరులు ఉన్నారు.

పనులు పకడ్బందీగా నిర్వహించాలి



మరుగుదొడ్డిని పరిశీలిస్తున్న నిర్మల్ పీఆర్ డీఈ తుకారాం, సిబ్బంది

లోకేశ్వరం: అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద మంజూరైన పనులు పకడ్బందీగా నిర్వహించాలని నిర్మల్ పీఆర్ డీఈ తుకారాం సూచించారు. మండలంలోని పంచగుడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్డిని మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద మంజూరైన రూ.2.40 లక్షలను పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సమస్యల పరిష్కారానికి వెచ్చిస్తున్నట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు దగ్గరుండి పనులు పర్యవేక్షించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో సోలమాన్‌రాజ్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాష్, పీఆర్ఏఈ రఘువంశీ, ఐకేపీ సభ్యులు ఉన్నారు.

సామూహిక కుంకుమార్చనలు



ఖానాపూర్‌లో పూజలో పాల్గొన్న భక్తులు

ఖానాపూర్: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం సామూహిక కుంకుమార్చనలో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈసందర్భంగా పురోహితులు కీర్తి రాఘవశర్మ, ప్రవీణ్ ఆధ్వర్యంలో విగ్రహమూర్తులకు పంచామృతాభిషేకం, గణపతి పూజ, కర్మనపుణ్యాహవచనం, స్థాపిత దేవతాపూజ, పంచకుండాత్మక లక్ష్మీనారాయణ, సుదర్శన నరసింహ సీతారామ చంద్ర మూలమంత్ర హోమాలు నిర్వహించారు. మస్కాపూర్ రామాలయంలో అర్చకులు ఆనంద్‌శర్మ ఆధ్వర్యంలో ఉత్సవవిగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం, దిక్ దేవతా స్థాపనం, బ్రహ్మకలశ స్థాపన, అగ్నిప్రతిష్ఠ హవనం, కుంకుమార్చన నిర్వహించారు.

పాఠశాలల్లో శ్రీరామనవమి వేడుకలు



భైంసాటౌన్: ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

భైంసాటౌన్: పట్టణంలోని గుజిరిగల్లి శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో మంగళవారం విద్యాపీఠం ఆవిర్భావ దినోత్సవం, ముందస్తు శ్రీరామనవమి వేడుకలను నిర్వహించారు. పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు మాట్లాడుతూ శ్రీరాముని జీవితం మానవాళికి ఆదర్శనీయమని, రాముని గుణగణాలను బాల్యం నుంచి అలవర్చుకోవాలన్నారు. అనంతరం పలువురు విద్యార్థులు శ్రీరాముడు, సీత, లక్ష్మణ, హనుమాన్ వేషధారణలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రబంధకారిణి సభ్యులు డా.నగేశ్, గోపాల్ కిషన్, పెండేపు కాశీనాథ్, శివకుమార్, నూకల సురేశ్, జి.రాజేశ్వర్, జి.లక్ష్మణ్, నవీన్, ప్రధానాచార్యులు శ్రీరాముల గంగాధర్, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుంటాలలో..

కుంటాల: కుంటాల శాంతినికేతన్ పాఠశాలలో మంగళవారం శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.